ప్రజాశక్తి
బుధవారం 10 మే 2023
5
విజయనగరం



ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని13 ఆదర్శపాఠశాలల్లో 2023 -24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యా శాఖ అధికారి బి. లింగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు అన్ని మండలాల్లోను ఆదర్శపాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. గత ఏడాది 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత కలిగిన విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశానికి www.cse.ap.gov.in/apms.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 10 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రవేశ రుసుం రూ.75, ఒసి, బిసి విద్యార్థులకు ప్రవేశ రుసుం రూ.150 అని తెలిపారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని తెలిపారు.

త్వరలోనే విజయనగరం అర్బన్ మండలం

విడుదలైన ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్ ● పౌరసేవలకు తొలగనున్న అంతరాయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

త్వరలోనే విజయనగరం అర్బన్ ప్రత్యేక మండలం కానుంది. దీంతో పౌరసేవల అంతరాయం తొలగనుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో విజయనగరం అర్బన్‌ను ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన విషయం విధితమే. ఈ నిర్ణయం అమలులో భాగంగా ఇప్పటికే రెవెన్యూ శాఖ ఖసరత్తు చేసింది. గెజిట్ నోటిఫికేషన్‌తోపాటు అభ్యంతరాలు స్వీకరించింది. అభ్యంతరాలు లేకపోవడంతో ఫైనల్ నోటిఫికేషన్ కూడా జారీచేశామని విజయనగరం ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ తెలిపారు. పట్టణం అభివృద్ధి చెందడంతో చుట్టుపక్కల కొన్ని గ్రామాలు కూడా విలీనమైన విషయం విధితమే. ఈ క్రమంలో గ్రేడ్ -1 మున్సిపాల్టీగావున్న విజయనగరం చాలా కాలం క్రితమే కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. కార్పొరేషన్ హోదాలో తొలి ఎన్నికలు కూడా జరిగాయి. కౌన్సిలర్లు, చైర్మన్‌కు బదులు కార్పొరేటర్లు, మేయర్ వంటి పదవులు వచ్చాయి. అందుకనుగుణంగానే జనాభా పెరిగింది. ప్రస్తుతం కార్పొరేషన్ జనాభా సుమారు 3.13లక్షల వరకు ఉంది. ఈ నేపథ్యంలో విజయనగరం మండలం, కార్పొరేషన్‌కు ఒకే తహశీల్దార్ కావడం వల్ల చాలా రెవెన్యూ సేవలు సకాలంలో అందడం లేదు. ముఖ్యంగా భూ వివాదాలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వ ఆస్తులపై పర్యవేక్షణ తగినంతగా లేకపోతోంది. చివరకు సర్టిఫికేట్ల జారీ వరకూ జాప్యం జరుగుతున్నాయి. దీనికితోడు మంత్రులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు తహసీల్దార్, ఆర్ఐ వంటివారికి ప్రోటోకాల్‌కే సగం సమయం సరిపోతోంది. ఈ నేపథ్యంలో అర్బన్ కేంద్రంగా ప్రత్యేక మండలం ఉండాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. మంత్రివర్గం ఆమోదంతో మరో కొత్త మండల కార్యాలయం ఏర్పాటు కానుంది.



మరోవైపు రెవెన్యూ డివిజన్ల పునర్విభజన సమయంలో నెల్లిమర్ల మండలం చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో చేర్చిన సంగతి తెలిసిందే. ఆ తరువాత నెలిమర్ల మండలవాసుల విజ్ఞప్తి మేరకు విజయనగరంలోకి మార్చినప్పటికీ కొన్ని సాంకేతిక కారణావల్ల సర్టిఫికెట్లు వంటి కొన్ని రకాల సేవలకు ఇంకా చీపురుపల్లే వెళ్తున్నారు. ఈ సమస్య కూడా త్వరలో పరిష్కారం కానుంది. ఇటీవల తారకరామతీర్థసాగర్ నిర్వాసితులకు సంబంధించిన నష్టపరిహారం, పునరావాసం విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయం ద్వారానే ప్రతుత్వానికి ఉత్తర ప్రత్యుత్తరాలు, 1398మంది నిర్వాసితులకు రూ.75.69కోట్లు మంజూరైంది. ఈనేపథ్యంలో నెల్లిమర్ల మండలం విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో కలిపేందుకు సాంకేతిక సమస్యలు కూడా త్వరలో పరిష్కారమౌతాయని సమాచారం.

అర్బన్ కేంద్రాల్లో సేకరించిన చెత్తతో ఎరువుల, విద్యుత్ తదితరాల తయారీకి సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీలో సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని రూ.1కే ఒక చదరపు గజం చొప్పున 20ఏళ్ల లీజుకు కేటాయించాలని, విజయనగరంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ కోర్టు ఏర్పాటుకు, లీగల్ సర్వీస్ ఇనిస్టిట్యూట్‌లో పోస్టుల భర్తీకి కూడా కూడా మంత్రి వర్గం నిర్ణయించిన సంగతి విధితమే. వీటన్నింటి అమలు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం. భోగాపురంలో 90ఎకరాల్లో ఐటి పార్కు ఏర్పాటు చేస్తామని, ఎస్.కోటదరిలో గతంలో వేరొక కంపెనీ కోసం సేకరించిన 985ఎకరాల భూమిని స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు కేటాయిస్తామంటూ మంత్రి వర్గం ఇచ్చిన హామీ నెరవేర్చడం ద్వారా జిల్లాలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కొంతమేరకైనా పెరిగేందుకు అవకాశం ఉంది.

సమస్యల పరిష్కారానికి జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలు పరిష్కరించుకొనేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం మంచి వేదిక అవుతుందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రజలు తమ సమస్యలను 1902 నెంబరుకు తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ నెంబరుకు ఫోన్‌చేసి తెలియజేస్తే ఆ సమస్య నేరుగా సిఎం కార్యాలయానికి చేరుతుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక మెరుగైన వేదికను ఏర్పరిచే లక్ష్యంతోనే జగనన్నకు చెబుదాం తీసుకువచ్చామన్నారు. తాడేపల్లి నివాసం నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లు, జిల్లాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఈ కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం అందించడం, తద్వారా అర్జీదారుల సంతోషమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్సులో మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, శాసనసభ్యులు బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పి.సురేష్ బాబు, జిల్లా ప్రత్యేక అధికారి, పాఠశాల విద్య కమిషనర్ సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రేగాన శ్రీనివాసరావు, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రజలు స్పందనలో ఇచ్చే వినతులు ఏ కారణం వల్లయినా పరిష్కారం కాకపోతే అటువంటి వినతులను సిఎం కార్యాలయ స్థాయిలో వాటికి పరిష్కారం చూపేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గతంలో స్పందనలో వినతులు ఇచ్చినప్పటికీ పరిష్కారం కానివారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకొని 1902 కు ఫోన్‌చేసి తమ సమస్యలు తెలియజేయ వచ్చున్నారు. జిల్లా నుంచి ఎంత తక్కువగా ఫోన్ కాల్స్ ఈ నెంబరుకు వెళ్తే ఆ జిల్లాలో యంత్రాంగం అంత సమర్థంగా పనిచేస్తున్నట్టు సూచికగా భావించాల్సి వుంటుందని పేర్కొన్నారు.

అమరావతి రాజధాని అయినంత మాత్రాన అక్కడ సామాన్యులు, మధ్యతరగతి వారు నివాసం వుండకూడదని చెప్పడం సబబుకాదన్నారు. రాజధానిలో సాధారణ పౌరులు నివాసం వుండకూడదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు మంత్రులు, సీనియర్ అధికారులను పంపించిందని తెలిపారు.

1902కు కాల్ చేసి సమస్యలు పరిష్కరించుకోండి : మంత్రి బొత్స



జగన్ ప్రసంగాన్ని వింటున్న మంత్రి బొత్స, ప్రజాప్రతినిధులు, కలెక్టర్

రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - పాచిపెంట

దేశం గర్వపడేలా పతకాలు తెచ్చిన మహిళా క్రీడాకారుల పట్ల బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ లైంగిక దాడులను నిరసిస్తూ మండలంలోని తెట్టేడవలసవలసలో ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు పడాల ఎర్రమ్మ, వెంకటమ్మ మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన ఎన్నో పతకాలు అందించి దేశ ప్రతిష్టను నిలబెట్టిన క్రీడాకారులపై లైంగిక దాడులు చేసిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఎంపి పదవి ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. క్రీడాకారుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగినా నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఎటువంటి చలనంలేదని అన్నారు.. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆడపిల్లలకు, మహిళలకు భద్రత లేదని అన్నారు. క్రీడాకారుల పైన లైంగిక దాడులకు పాల్పడిన బ్రిజ్జు భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.


మహిళలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న రాజన్నదొర

గిరిజన గ్రామాల్లోనూ అభివృద్ధి

గడప గడపకు కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మెంటాడ

వైసిపి ప్రభుత్వంలో మారుమూల గిరిజన గ్రామాలు కూడా ఎంతో అభివృద్ధి చెందాయని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. రోడ్డు, కరెంటు, తాగునీటి సౌకర్యం, గుడులు, బడులతో నేడు గిరిజన గ్రామాలు కలకలలాడు తున్నాయన్నారు. మంగళవారం ఉద్దంగి పంచాయతీ పరిధిలోని పులిగుమ్మి, గుర్రమ్మవలస గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంతో గిరిజనులు దళితులు, విద్యాపరంగా ఎంతో అభివృద్ధి చెందారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఒకవేళ అర్హులైన వారు సాంకేతిక లోపాలు వల్ల సంక్షేమ పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైసిపి నాయకులు లెంక రత్నాకర్ నాయుడు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, సీనియర్ నాయకులు దాట్ల హను మంతరాజు, సచివా లయ కన్వీనర్ కనిమెరక త్రినాథ్, ఎంపి టిసిలు, సర్పం చులు వాలంటీర్లు అధికా రులు పాల్గొన్నారు.

11న సబ్ జూనియర్ వాలీబాల్ జట్టు ఎంపిక


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 14న రాజమండ్రిలో జరుగు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్ వాలీబాల్ బాలుర, బాలికల జట్టు ఎంపిక పోటీలకు విజయనగరం జిల్లా నుండి ఇద్దరు బాలురు, బాలికలను ఎంపిక చేయనున్నారు. జిల్లా క్రీడా కారుల ఎంపిక ఈనెల 11 సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు రాజీవ్ స్టేడియంలో ఎంపిక చేస్తామని వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కెవిఎన్ రాజు తెలిపారు. 2007 జనవరి 10 తరువాత పుట్టిన వారు అర్హులని, పుట్టినతేదీ సర్టిఫికెటు తీసుకొని హాజరు కావాలని తెలిపారు.

జీవన జ్యోతి, సురక్ష బీమా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎపి జివిబి - లీడ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యాన జిల్లాలోని నాలుగు బ్రాంచిల్లో 10మంది బాధితులకు మంగళవారం రూ.20లక్షల విలుగల చెక్కులను ఆయా బ్యాంకు అధికారులు అందజేశారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన పథకాలు 2015 మే 9 నుంచి అమలవుతున్న విషయం విధితమే. ఈ బీమా పథకాల్లో భాగంగా భోగాపురం, డెంకాడ, కుమిలి, సతివాడ ఎపి గ్రామీన వికాస్ బ్యాంకు పరిధిలోని ఇద్దరికి ప్రమాద బీమా రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.4లక్షలు, జీవిత బీమా కింద రూ.2లక్షల చొప్పున ఆరుగురికి రూ.12లక్షలు అందజేసినట్టు లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. అర్హులందరికీ ఆ పథకాల కింద నిధులు మంజూరవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం నాగార్జున, ఎపి జివిబి అడ్మిన్ సునిల్ వర్మ, నోడల్ ఆఫీసర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న లీడ్‌బ్యాంకు మేనేజర్, నాబార్డు డిజిఎం తదితరులు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అందుబాటులోకి మరో మూడు ఇసుక రీచ్‌లు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో త్వరలో మరో మూడు ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ మూడు రీచ్‌లకు ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకొనేందుకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నిర్ణయం తీసుకున్నారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం జరిగింది. సంతకవిటి మండలం తమరాం, రేగిడి ఆమదాలవలస మండలం కె.వెంకటాపురం, తెర్లాం మండలం కుసుమూరు ఓపెన్ ఇసుక రీచ్‌లపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఇచ్చిన నివేదికను జిల్లా గనులు భూగర్భ శాఖాధికారి సిహెచ్ సూర్యచంద్రరావు, జిల్లా కలెక్టర్ ముందు ఉంచారు. ఈ రీచ్‌ల పరిమాణాన్ని, ఇసుక లభ్యతను, ఇతర అంశాలను కలెక్టర్‌కు ఆయన వివరించారు. తమరాం ఇసుక రీచ్ సుమారు 3.24 హెక్టార్లలో, దాదాపు 32,393 క్యూబిక్ మీటర్ల ఇసుక, కె.వెంకటాపురం రీచ్‌లో 4.85 హెక్టార్లలో 48,485 క్యూబిక్ మీటర్ల ఇసుక, కుసుమూరులో 1.13 హెక్టార్లలో 11,360 క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఇసుక లభ్యత, నాణ్యత, ఇతర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ రీచ్‌ల నిర్వహణకు ప్రభుత్వం నుంచి జెపి పవర్ వెంచర్స్ చట్టప్రకారం అనుమతులు పొందడానికి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కంపెనీ ఇసి, సిఎఫ్ఇ, సిఎఫ్ఒ తదితర అనుమతులను ప్రభుత్వం నుంచి పొందిన అనంతరం ఇసుక రీచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. సమావేశంలో జిల్లా గనులు భూగర్భ శాఖాధికారి సిహెచ్ సూర్యచంద్రరావు , గ్రౌండ్ వాటర్ డిడి దుర్గాప్రసాదరావు, ఎస్ఇబి సూపరింటిండెంట్ సుధాకర్, జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ శాఖాధికారులు పాల్గొన్నారు.

క్రీడా వికాసం కోసమే వేసవి శిబిరాలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం

మానసిక, శారీరక వికాసం కోసం క్రీడలు దోహదపడతాయని శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వేసవి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాన్ని క్రీడాపరంగా కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కషి చేస్తోందని చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో మంగళవారం ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రీడా శిక్షణా కార్యక్రమాన్ని ఉపయోగించుకొని, నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. విద్యార్థులు కేవలం చదువుపైనే కాకుండా ఆటలపైనా దృష్టి పెట్టాలన్నారు. క్రీడల ద్వారా విద్య, ఉద్యోగాలు కూడా సాధించవచ్చునని చెప్పారు. ప్రతీఒక్కరూ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొని క్రీడాపరంగా రాణించాలని కోలగట్ల కోరారు. ఎపి సిఎం కప్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మానసిక శారీరక ఎదుగుదలకు, ఉల్లాసానికి క్రీడలు ఒక మార్గమని సూచించారు. దీనిలో భాగంగానే క్రీడా శిబిరాలను నిర్వహించడమే కాకుండా, స్పోర్ట్స్ కిట్లను కూడా అందించడం జరుగుతోందని అన్నారు. క్రీడాభివృద్ధికి, క్రీడా నైపుణ్యం ఉన్నారికి జిల్లా పరిషత్ నుంచి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రీడాపరంగా జిల్లాకు ఎంతో ఘన చరిత్ర ఉందని, ఇక్కడి క్రీడాకారులు దేశవిదేశాల్లో ఎంతో పేరుప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. వారి వారసత్వాన్ని కొనసాగించి, జిల్లాకు ఎంతో పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. సెట్విజ్ సిఇఒ రాంగోపాల్ మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, హేండ్ బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, తైక్వాండో, కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, ఫెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు, జిల్లా ప్రధాన శిక్షకులు రాజగోపాల్, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథకుమార్, మాజీ డిసిఎంఎస్ అధ్యక్షులు కెవి సూర్యనారాయణరాజు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డివి చారి ప్రసాద్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాళ్ల సూరిబాబు, ఫెన్సింగ్ కోచ్ ఎం.సతీష్‌కుమార్, బాక్సింగ్ కోచ్ బి. ఈశ్వర్రావు, పలువురు కోచ్‌లు, పీడీలు, పిఇటిలు, క్రీడాకారులు పాల్గొన్నారు. సిఎం కప్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు.


చిన్నారుల తైక్వాండో ప్రదర్శనను తిలకిస్తున్న జెడ్‌పి చైర్మన్, డిప్యూటీ స్పీకర్

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. 33 ఏళ్ల తర్వాత ఫుట్ బాల్‌లో విజయనగరం జిల్లా జట్టు రాష్ట్రస్థాయిలో విజయకేతనం ఎగురవేయడం గర్వించదగ్గ విషయమన్నారు. చిత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన సిఎం కప్- ఫైనల్స్ లో విజయం సాధించిన విజయనగరం జట్టు కప్పును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు అసోసియేషన్ చైర్మన్, శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారిని కోలగట్ల అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, విజయనగరం ఖ్యాతిని నలుదిశలా చాటాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు దర్శపుడి రజినీ కుమార్, ఉపాధ్యక్షుడు డి.చిట్టి, కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్. బి.ఎస్ రాజేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయాలి

విద్యాశాఖా మంత్రికి ఉపాధ్యాయ సంఘాల వినతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వేసవి సెలవుల్లో పనిచేసినందుకు గాను ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు (ఇఎల్ఎస్) మంజూరు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విద్యాశాఖా మంత్రి బొత్ససత్యనారాయణను కోరారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక తరుపున డి.ఈశ్వరరావు(ఎపిటిఎఫ్) ఆధ్వర్యాన విద్యాశాఖ మంత్రి బొత్స.సత్యనారాయణ, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్. సురేష్ కుమార్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి వినతి అందజేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు నాడు-నేడు, వుయ్ లవ్ రీడింగ్, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, స్కూల్ ఏజ్ చిల్డ్రన్ సెన్సస్, ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు, జెవి కెకిట్ సరఫరా తదితర విధుల్లో పనిచేస్తున్నందున, ఆ కాలానికి గాను ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జెవిఎఆర్ కె ఈశ్వరరావు, రమేష్ చంద్ర పట్నాయక్ (యుటిఎఫ్), డి శ్యామ్ (ఎస్‌టియు), సన్యాసిరాజు(హెచ్‌ఎం అసోసియేషన్) బుఖారి బాబు(ఎపిటి ఎఫ్ 257), చిట్టి రాము నాయుడు (పిఆర్‌టియు) సన్యాసినాయుడు (పిఇటి అసోసియేషన్), రామునాయుడు(ఆపస్) మహేశ్వరరావు (ఆప్టా), వై.అప్పారావు (ఎస్‌టియు) అప్పలరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నాక్ గుర్తింపు పత్రాన్ని ప్రదర్శిస్తున్న కళాశాల చైర్మన్ రఘు తదితరులు

రఘు కళాశాలకు నాక్ ఎ- ప్లస్ గ్రేడ్ గుర్తింపు

కళాశాల చైర్మన్ రఘు కలిదిండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రఘు ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన నాక్ ఎ-ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు తెలిపారు. మంగళవారం ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కళాశాలను సందర్శించిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) నిపుణుల బృందం రెండు రోజులపాటు కళాశాలలో మౌళిక వసతులు, మానవ వనరులు, ప్రయోగశాలలు వంటివి ప్రత్యక్షంగా పరిశీలించి. అత్యుత్తమ ర్యాంకును అందించాయని తెలిపారు. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు కళాశాలకు చేరాయని చెప్పారు. ఇప్పటికే రఘు ఇంజీనరింగ్ కళాశాల అటానమస్ గుర్తింపు, ఎన్‌బిఎ గుర్తింపును సైతం కలిగి ఉందని, ప్రస్తుతం నాక్ ఎ-ప్లస్ గుర్తింపుతో కళాశాల ప్రమాణాలు అత్యుత్తమంగా ఉన్నట్లు స్పష్టమయ్యాయని తెలిపారు. నాక్ 4.0 స్కేల్ పై తమ కళాశాలకు 3.35 మార్కులను పొంది, ఎ-ప్లస్ గ్రేడిని సాధించిందన్నారు.

కంప్యూటర్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలలోని నాలుగు రీసెర్చ్‌సెంటర్లు జెఎన్‌టియు గుర్తింపును సైతం కలిగి ఉన్నాయన్నారు. అత్యున్నత ప్రమాణాలతో విలువలతో కూడిన విద్యను అందిస్తూ, నూతన విద్యా విధానంలో సూచించిన విధంగా దేశానికి విలువైన మానవ వనరులుగా యువతను తీర్చిదిద్దే దిశగా రఘు విద్యాసంస్థలు. పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విజయ్ కుమార్, డాక్టర్ పిఎస్‌ఆర్ చౌదరి, ఆచార్య ఎఎస్ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరం

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి రమణకుమారి

ప్రజాశక్తి- డెంకాడ

గర్భిణులకు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు అవసరమని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో జరుగుతున్న పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు నిత్యం వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం డెంకాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.భవాని 41 మంది గర్భిణులకు తనిఖీలు చేశారు. శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత భోజనాలు పెట్టగా పినతాడివాడ సర్పంచ్ ఎండల నేపథ్యంలో టెంట్లు, కుర్చీలను ఏర్పాటు చేశారు. ఈ కారక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వేపాడ: గర్భిణులకు వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ ధరణి

కొత్తవలస: వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 55 మంది గర్భిణులకు వైద్య తనిఖీ చేసినట్లు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. గర్భిణులకు బిపి, సుగర్, హిమోగ్లోబిన్, హెచ్ఐవి, మూత్ర పరీక్షలు చేసి కాల్షియం, ఐరన్, బి.కాంప్లెక్స్ మాత్రలు ఇచ్చినట్లు తెలిపారు. 12మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించామన్నారు. గర్భిణులందరూ పాలు, గుడ్లు, చేపలు, ఖార్జురం, రాగి మాల్ట్, బెల్లం పప్పు ఉండలు, నువ్వు ఉండలు, మునగాకు వంటి ఆహార పదార్థాలు తినాలన్నారు. 4వ నెల, 8వ నెలలోను స్కానింగ్ చేయించుకోవాలని ప్రతీ 15 రోజులు కొకసారి వైద్యునిచే తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ జగదాంబ, ఇఒలు గోవింద రాజులు, తిరుపతిరావు, రాము, పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్స్ పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ధరణి 54 మంది గర్భిణులకు తనిఖీలు చేశారు. అనంతరం వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు బానాది గ్రామానికి చెందిన సాయిరాం ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

జామి: సమాజంలో అన్నదానం అనేది ఎంతో గొప్ప విషయమని, ప్రతి ఒక్కరూ అన్నదానం చేసేందుకు ముందుకు రావాలని మండలంలోని రామభద్రపుర అగ్రహారంలో ఉన్న శ్రీ ఉమా వీరేశ్వరస్వామి ఆశ్రమ పీఠాధిపతి సాయినాన్న తెలిపారు. ప్రతీ నెలా 9వ తేదీన జామి పిహెచ్‌సిలో గర్భిణులను నెలవారీ తనిఖీ నిర్వహిస్తారు. తనిఖీలకు వచ్చిన గర్భిణులకు ఆయన ఆధ్వర్యంలో భోజన వసతి సౌకర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎస్. భాగ్యరేఖ ప్రారంబించారు. గర్భిణులకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా సాయినాన్న మాట్లాడుతూ పిహెచ్‌సిలో తమవద్దకు వచ్చే రోగులకు ఏర్పాట్లు చేయడంలో వైద్యాధికారిణి కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో 120 మందికి పైగా గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సమాజ సేవకులు నార్ల మహంతి నారాయణరావు, కిశోర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విన్నకోట నానాజీ, ఎం. మనోజ్‌కుమార్, ఎన్. సూర్యతేజ పాల్గొన్నారు.


డెంకాడ: సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంఅండ్‌హెచ్ఒ రమణకుమారి

రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి: రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, సచివాలయ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని మంగళవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఫ్రూట్ జ్యూస్ వ్యాపారులు, రిలయన్స్ ట్రెండ్స్, వ్యాపారులు రోడ్లపై చెత్త వేయడం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశించారు. జూట్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా విధించాలన్నారు.

రోడ్డు విస్తరణలో విఫలం

బొబ్బిలి: ప్రస్తుత వైసిపి ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులో చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొబ్బిలిలో రోడ్డు విస్తరణతో పాటు తాగునీటి సమస్యలు, డ్రైనేజీలు, మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బొబ్బిలిని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

బొబ్బిలి : డ్రగ్స్‌తో జీవితాలు నాశనమవుతాయని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ అన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో మంగళవారం డ్రగ్స్ నివారణకు తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు, ఆర్‌టిసి పార్సిల్ సర్వీస్ బ్యాగులు, బస్సులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రగ్స్ వినియోగానికి యువత దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగించిన, అమ్మిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ విస్సంనాయుడు, సిబ్బంది ఉన్నారు.

మల్లంపేట విద్యార్థి షర్మిలకు అభినందనలు

బొబ్బిలి: పార్వతీపురం మన్యం జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిన బొబ్బిలి మండలంలో మల్లంపేట గ్రామానికి చెందిన కర్రి షర్మిలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అభినందించారు. సాలూరు జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన షర్మిల 585 మార్కులు సాధించడంతో ఆమెను అభినందించారు.

పేదల ఆకలి తీరుస్తున్న ఫుడ్ బ్యాంకులు

విజయనగరం టౌన్ : పేదల ఆకలి బాధలను తీరుస్తున్న ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు ఆదర్శనీయమని మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు అన్నారు. మంగళవారం స్థానిక కంటోన్మెంట్ ఫుడ్ బ్యాంక్‌లో పిల్లా వెంకోపారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కార్పొరేటర్ పిల్లా రాధా భవాని ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన కొండలరావుకు ఉచిత రీతిన సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, పిన్నింటి సూర్యనారాయణ, డిసిసిపి లింగం తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లు, రోడ్లు వెయ్యాలి

విజయనగరం టౌన్ : నగరంలోని ఒకటవ డివిజన్ పరిధిలోని అయ్యప్ప నగర్ స్వామి లేఅవుట్ పేరు గొప్ప- ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని విజయనగరం అపార్ట్ మెంట్లు కాలనీస్ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవి కుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి. రామచంద్రరావు అన్నారు. ఈ ప్రాంతంలో అనేక మంది అపార్ట్ మెంట్లు కొనుక్కొని మధ్య తరగతి ప్రజలు నివాసం ఉంటున్నారు. కానీ నేటి గతుకుల రోడ్లే గతి అని అన్నారు. రోడ్లు వేయాలనే ఆలోచన ఇక్కడ కార్పొరేటర్‌కు గాని, మున్సిపల్ అధికారులకు గాని లేదని పేర్కొన్నారు. వెంటనే స్పందించి వీధి లైట్లు, రోడ్లు వేయాలని కోరారు. జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయ కూడదని ప్రభుత్వ విధానం ఉన్నా ఏర్పాటు చేశారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 500 అడుగులు ఆపైన లోతులో బోరు తవ్వి నీటిని అమ్ముకుంటారు. అంటే 500 అడుగుల లోపు ఉన్న మోటార్లన్ని వేసవిలో ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ వాటర్ ప్లాంట్‌లను రద్దు చేయాల డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 11న మున్సిపల్ కమిషనర్‌కు భూ గర్భ జల శాఖ జిల్లా అధికారులకు వినతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులంతా పాల్గొనాలని కోరారు.

రోజా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

డెంకాడ: మంత్రి రోజా సిఎం జగన్‌కు మాదిరిగా పేపర్ మీద రాసి ఇస్తే చదవడం కాదని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడటం మంచిదని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టును అంతర్జాతీయ గుర్తింపు, విశాఖ ఎయిర్‌పోర్టు ఆధునీకరణ, కర్నూల్ ఎయిర్ పోర్టు, రాష్ట్రంలో ఇతర కొత్త ఎయిర్ పోర్టుల ఆధునీకరణ వంటి వాటికి కేంద్రంతో పోరాడి కృషి చేసిన వ్యక్తి అశోక్ గజపతిరాజు అని గుర్తు చేశారు. అటువంటి వ్యక్తిని ఇటీవల జిల్లాకు వచ్చిన మంత్రి రోజా విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఆయన గురించి మాట్లాడే అర్హత కూడా ఆమెకు లేదని ఆయన మండిపడ్డారు. 2014 నుండి 2019 వరకు రాష్ట్రంలో అన్ని ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేసిన ఘనత అశోక్ గజపతిరాజుకు దక్కుతుందన్నారు. అటువంటి వ్యక్తిని విమర్శించడం పనికిమాలిన చర్యన్నారు.


కంది చంద్రశేఖర్‌రావు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి

లక్కవరపుకోట : మండలంలోని సోంపురం జంక్షన్ సమీపంలో ఉన్న మధుము మధ్యలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్మీ ఉద్యోగి మృతి చెందారు. గొల్జాం గ్రామానికి చెందిన పిన్నింటి జగదీష్ (37) ఆర్మీలో ఉద్యోగం చేస్తూ తన మేనల్లుడు వివాహానికి వచ్చి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. జగదీష్ ఎల్‌కోట నుంచి గొల్లాం వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేసే బొలేరో బలంగా ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడికే మృతి చెందారు. మృతునికి భార్య 4,5 ఏళ్లు కలిగిన ఇద్దరు కుమార్తెలున్నారు. విశాఖ - అరకు ప్రధాన రహదారిలో గల సోంపురం జంక్షన్ ముదుము మధ్యలో ప్రమాదం జరగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మృతదేహానికి సవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగదీష్

520 కేజీల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: వాహన తనిఖీలో భాగంగా 520 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సింహాద్రి నాయుడు మంగళవారం తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో బొడ్డవరం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అరకు నుంచి ఎస్ కోట వైపు వస్తున్న టాటా ఏసీ వాహనంలో 520 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. ఒడిస్సా రాష్ట్రం ముంచింగుపుట్టుకు చెందిన కృష్ణ, జోల పుట్టుకు చెందిన హాంతాల్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు కోటి రూపాయలు ఉంటుందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

10 కేజీ గంజాయితో ముగ్గురు వ్యక్తులు అరెస్టు

కొత్తవలస: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని కొత్తవలస పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ ఎస్ బాల సూర్యారావు తుమ్మికాపల్లి వద్ద వాహనాలు చెక్ చేస్తుండగా ఆర్టీసీ బస్సు దిగి వెళ్లిపోతున్న ముగ్గురును పోలీస్ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారని సిఐ తెలిపారు. వారి వద్ద నుండి 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టులో హాజరపరిచామన్నారు. నిందితులు బాబీదేవి, అనిరుగ్ కుమార్, అంకేష్ కుష్వ కాగా మరొకరు పరారీలో ఉన్నారన్నారు. ఈ దాడిలో ఎస్ఐ బి. దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు నడవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రతి ఒక్కరూ లక్ష్యం పెట్టుకుని ముందుకు నడవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చిలుకూరి శాంతమ్మ పిలుపునిచ్చారు. ఏటా మాతృ దినోత్సవం పురస్కరించుకొని తెలుగు విశ్వవిద్యాలయం, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా అందజేసే షష్టిపూర్తి కళల సాహితీ పురస్కారాన్ని ప్రొఫెసర్ శాంతమ్మకు మంగళవారం సెంచూరియన్‌లో అందజేశారు. విసి జిఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తన జీవితంలో తాను ఎప్పుడూ రాజీపడలేదన్నారు. తనకు వచ్చిన అవకాశాలను ఉపయోగించుకున్నానే తప్ప ఇందులో తన గొప్పతనం ఏదీ లేదన్నారు. విసి మాట్లాడుతూ తనకు గురుతుల్యులైన శాంతమ్మ వల్ల విశ్వవిద్యాలయానికి గుర్తింపు ఉందన్నారు. 95 ఏళ్ల వయసులో కూడా ఆమె వేద గణితంపై పరిశోధనలు చేయడంతోపాటు చక్కని బోధనను అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. నేటి విద్యార్థులు ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతినిధిగా పాల్గొన్న అనుబంధ ప్రొఫెసర్ జి.వెంకటరామయ్య మాట్లాడుతూ గత రెండేళ్ళగా 60 ఏళ్లు దాటిన మహిళా సాహితీ వేత్తలకు తెలుగు విశ్వవిద్యాలయం ఈ పురస్కారాలను అందజేస్తుందన్నారు. వయసు పైబడటం వల్ల శాంతమ్మ అక్కడకు రాలేనని తెలపడంతో తామె ఇక్కడకు వచ్చి ఈ పురస్కారాన్ని అందజేశామన్నారు. ఈనెల 11న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మిగిలిన వారికి అక్కడ పురస్కారాలను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్న తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తంగేడి కిషన్‌రావును కొనియాడారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన డాక్టర్ చివుకుల శ్రీలక్ష్మీ, కె.అన్నపూర్ణ, నందివాడ చిన్నాదేవితోపాటు డీన్లు ప్రొఫెసర్ కెవిజి కృష్ణమూర్తి, ప్రొఫెసర్ ఎం.లక్ష్మీనరసింహాచార్యులు, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీడియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్‌వర్మ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ శాంతమ్మను సత్కరిస్తున్న తోటి ప్రొఫెసర్లు

ఒక్కపూటే ఉపాధి పని నిర్వహించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఉపాధి హామీ పని ఒక్కపూటే నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలోకి కొత్త సాఫ్ట్ వేర్ తీసుకువచ్చి రెండు పూటల పనులు పెట్టడం వల్ల మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన రేపాక నారాయణమ్మ (55) వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు చెప్పారు. గుంటోడు బంధలో ఉపాధి హామీ పనులు నిర్వహించుకుని మండుటెండలో ఇంటికి తిరిగి వచ్చే సమయంలో మార్గం మధ్యలో అక్కడకక్కడే ప్రాణం వదిలిందని, రవణమ్మ కుటుంబానికి రూ. 5 లక్షల కాంపొజిషన్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్మికులకు రక్షణగా కార్మిక సంక్షేమ బోర్డు ఉండేదని ఆబోర్డులో ఉన్న నిధులు గతంలో ఉన్న టిడిపి ప్రభుత్వం నేడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వాలు దారి మళ్లించాయన్నారు. దాని వల్ల రక్షణగా ఉన్న బోర్డు కనుమరుగయ్యిందన్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 5లక్షలు సంక్షేమ బోర్డ్ ఇచ్చేదని, సాధారణ మరణం అయినట్లయితే రూ. 2లక్షలు ఇచ్చేదని, కార్మికుడు తమ కుమార్తె పెళ్లి చేస్తే పెళ్లి కానుక ఇచ్చేదని గుర్తు చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ విధానాన్ని రద్దు చేయాలని, రోజు కూలి రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే పని ప్రదేశాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు రాఘవ తదితరులు పాల్గొన్నారు.


ఎంపిడిఒకు వినతి పత్రమిస్తున్న నాయకులు

ఘనంగా ప్రతిష్ట ఉత్సవాలు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని గొండయ్యపాలెంలో రామాలయ ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ యాగశాల ప్రవేశం, మండల మంటపారాధనలు, అగ్నిప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, నిత్యార్చనలు చేపట్టారు. సాయంత్రం 6గంటల నుంచి సాయంసంధ్యా అర్చనలు, యోగిని, క్షేత్రపాలక, వాస్తుపురష, నక్షత్ర, నవగ్రహ, దిక్షాలక, సంచపాలన, హోమాలు నిర్వహించారు. రాత్రి 8గంటలకు క్షీరాధివాసం, మంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాళ్ల రామసూరి, మంగ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు.


డెంకాడ: ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

ఘనంగా పైడితల్లమ్మ పండగ

లక్కవరపుకోట : మండలంలోని కొట్యాడ పంచాయతీ పరిధిలోని నాయుడుపేట గ్రామ సమీపంలో వెలిసిన పైడితల్లమ్మ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం, విశాఖ జిల్లాల నలుమూలల నుండి వేల సంఖ్యలో భక్తులు రావడంతో గ్రామం కిక్కిరిసిపోయింది. 54 ఏళ్ల తరువాత ఈ పండుగను నిర్వహించడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కొట్యాడ పంచాయతీ కళకళలాడింది. ప్రతి ఇంటికి వందల సంఖ్యలో బంధువులు, సన్నిహితులు ఆహ్వానించడంతో సుమారు 30 వేల మంది పండుగకు హాజరైనట్లు అంచనా. తీన్మార్ నడుమ పులి వేషాలు , తప్పెటగుళ్ళు, కోలాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా స్థానిక ఎస్ఐ ఎం. ముకుందరావు ఆధ్వర్యంలో పోలీస్ యంత్రాంగం బందోబస్తు నిర్వహించింది. కొట్యాడ సర్పంచ్ దేవి, మహేష్, ఎఎంసి డైరెక్టర్ యర్ర శ్రీనివాసరావు, సునీత దంపతుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎల్ కోట, జామి వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, గొర్లె రవికుమార్, హిస్టరీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ స్వాతిరత్నం, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ జ్ఞానేశ్వరావు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లుకు మరమ్మతులు

వంగర: మండలంలోని శ్రీహరిపురం, ఆర్ఆర్ కాలనీలో మరమ్మత్తులకు గురైన తాగునీటి బోర్లను మెకానిక్‌లు కృపారావు, వెంకటరమణ, రామకృష్ణ మంగళవారం బాగు చేసి తాగునీరు అందించారు. సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా పలు గ్రామాలలో మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేసి తాగునీరు అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి బోర్లు మరమ్మతకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ విషయంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కూడా తమకు సహకారమందించాలన్నారు. గ్రామాల్లో పాడైన బోర్ల జాబితాను తమకు ఇస్తే వెంటనే బాగు చేసి తాగునీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తులు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపల్ గెద్ద ఈశ్వరరావు కోరారు. దరఖాస్తులు ఈనెల తొమ్మిదవ తేదీ నుండి 25వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేయదలచిన వారు. https://apms.ap.gov.in/apmsలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలన్నారు. ఒసి, బిసిలు, 2011 సెప్టెంబరు ఒకటి నుంచి 2013 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలన్నారు. వీరికి జూన్ 11న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

సర్పంచుల జిల్లా సదస్సు జయప్రదం చేయండి

నెల్లిమర్ల: సర్పంచుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పంచాయతి రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి గేదెల రాజారావు కోరారు. మంగళవారం ఆయన ధన్నానపేటలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 12న దాసన్నపేట ఫంక్షన్‌హాల్లో జిల్లా సర్పంచుల సంఘం సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు పంచాయతి రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుల వైవిబి రాజేంద్ర ప్రసాద్, ఎపి సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ, ముత్యాల రావు హాజరవుతారన్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులు విద్యుత్ బకాయిల పేరిట దొంగిలించడం, ఉపాధి హామీ పథకం నిధులు దారి మళ్లించడం, సర్పంచుల అధికారాలు తీసివేయడం వంటి అంశాల పై సదస్సులో చర్చిస్తామన్నారు. గ్రామ సచివాలయం, వాలంటీర్లు, గృహ సారథులను ఏర్పాటు చేసి సర్పంచుల అధికారాలను హైజాక్ చేస్తుందన్నారు. కాగా సర్పంచుల సమస్యల పరిష్కారంకి భవిష్యత్ కార్యాచరణ జిల్లా సదస్సులో రూపొందిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా సర్పంచులు పార్టీలకు అతీతంగా సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని రాజారావు కోరారు.

ప్రధానోపాధ్యాయులతో సమావేశం

వేపాడ: స్థానిక ఎంఆర్‌సిలో వివిధ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులతో ఎంఇఒ జి.శ్రీదేవి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 'ఎన్‌రోల్ మెంట్ డ్రైవ్ 2023-2024' జెవికె, మనబడి, నాడు నేడు, ఒఎస్‌సి, డ్రాపౌట్స్, న్యూ ఇయర్ ఎన్‌రోల్‌మెంట్, అదర్ ఎడ్యుకేషన్ రిలేటెడ్, సమస్యలకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

రేగిడి : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంఇఒ ఎంవి ప్రసాద్‌రావు మంగళవారం మనబడి నాడు - నేడు ఫేస్ 2 ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాడు నేడు ఫేజ్ 2కు సంబంధించిన పాఠశాలలో 10 అంశాల పై పురోగతి ఏ పాఠశాలలో ఏ మేరకు ఉందో అడిగి తెలుసుకున్నారు. సెలవుల్లో కూడా మనబడి నాడు నేడు పాఠశాల పనులు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు ప్రధానోపాధ్యాయులు మరొక ఉపాధ్యాయులు కలిసి మనబడి నాడు నేడు పనులను పర్యవేక్షించి వేగవంతం చేయాలన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలకు వుయ్ లవ్ రీడింగ్ నిర్వహించాన్నారు. జగనన్న విద్యా కానుకకు సంబంధించి ఎప్పుడు సరఫరా చేసిన అందరూ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు. కొత్త అడ్మిషన్స్ కోసం గ్రామాల్లో ఉపాధ్యాయులు సందర్శించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


రేగిడి: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఇఒ

ఆఫీసుకు స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుల ఆఫీసుకు స్థలం కేటాయించకపోతే సమ్మె చేపడతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్కు చెరువు గట్టుపై పారిశుధ్య కార్మికుల కార్యాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, అప్పటి మున్సిపల్ కమిషనర్ ఎంఎం నాయుడు అనుమతులు ఇవ్వడంతో రూ.90వేలు ఖర్చు చేసి పునాదులు నిర్మించామన్నారు. రాజకీయ ఒత్తిడితో పునాదులను తొలగించారన్నారు. పారిశుధ్య కార్మికులు నిర్మించిన పునాదులను తొలగించిన అధికారులు అనేకమంది చెరువు గట్టును ఆక్రమించేసి నిర్మాణాలు చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. చెరువు గట్టుపై చర్చిలు, దేవాలయాలు, ఇతర నిర్మాణాలు చేస్తే అభ్యంతరం చేయని అధికారులు పారిశుధ్య కార్మికులు నిర్మిస్తే అభ్యంతరం చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులు పట్ల వివక్షత చూపడం అన్యాయమన్నారు. ఈ కార్యాలయానికి స్థలం కేటాయించకపోతే సమ్మె చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి.గౌరి, ఉపాధ్యక్షులు జి.వాసు, పి.వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల వేతనాలు చెల్లించండి

బాడంగి: 104 ఉద్యోగుల బకాయి వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వాడాడ పిహెచ్‌సి వైద్యులు చక్రవర్తికి మంగళవారం వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 104 సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఇఒ రామకృష్ణ, పైలట్ సంతోష్ ఉన్నారు.

శృంగవరపుకోట: 104 సిబ్బందికి జీతాలు వెంటనే చెల్లించాలని మండల సిబ్బంది కోటారావు, మహాలక్ష్మి కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని హారికకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 104 సిబ్బందిను ఆప్కాస్‌లో పెడతామని హామీతో పాటు నెల నెల జీతాలు వచ్చే విధంగా చూస్తామని చెప్పారని గుర్తు చేశారు. 3 నెలలుగా జీతాలు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 104 స్టేట్ కమిటీ పిలుపు మేరకు సమస్యలపై ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్య అధికారిని హారికకు ఫ్యామిలీ ఫిజిసియన్ ప్రోగ్రాంలో భాగంగా వినతి పత్రం ఇచ్చామన్నారు.


బాడంగి: వైద్యాధికారికి వినతి పత్రమిస్తున్న సిబ్బంది


ఎస్‌కోట: వైద్యాధికారికి వినతి పత్రమిస్తున్న సిబ్బంది

రోగికి సేవా సంఘం సాయం

మెంటాడ: మండలంలోని ఉద్దంగి పంచాయితీ పరిధిలో గల పులి గుమ్మిలోవ గ్రామంలో మెంటాడ అప్పలనాయుడు గత కొంత కాలంగా పక్షవాతంతో కదల్లేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాతృభూమి సేవా సంఘం సభ్యులు గౌరినాయుడు స్పందించి మంగళవారం బాధితునికి వీల్ చైర్, ఒక నెలకు సరిపడా సరుకులు అందించారు. ఈ సందర్భంగా మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇలవలస గోపాలరావు మాట్లాడుతూ ఆదరణ లేని పేదలను ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, విజయనగరం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సభ్యులు మహేష్, మెంటాడ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


వీల్‌చైర్‌ను అందిస్తున్న సభ్యులు